నాగపూర్ దీక్షాభూమి సందర్శనకు తరలిన స్వేరోస్ నేతలు



దశ ఓయూ: నాగపూర్‌లోని చారిత్రక దీక్షాభూమి సందర్శనకు స్వేరోస్ నాయకులు సోమవారం సికింద్రాబాద్ నుంచి తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్వేరోస్ నగర కార్యదర్శి కుమార్ షా మాట్లాడుతూ.. దీక్షాభూమికి చారిత్రకంగా ఎంతో ప్రాముఖ్యత ఉందని పేర్కొన్నారు. కళింగ యుద్ధం అనంతరం చక్రవర్తి అశోకుడు హింసను విడిచిపెట్టి అహింసా మార్గాన్ని, బౌద్ధ ధర్మాన్ని స్వీకరించారని తెలిపారు. అదేవిధంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 1956 అక్టోబర్ 14న విజయదశమి రోజున నాగపూర్‌లోని దీక్షాభూమిలో బౌద్ధ ధర్మాన్ని స్వీకరించారని గుర్తుచేశారు. ఈ చారిత్రక ఘట్టం దేశ చరిత్రలో విశేష ప్రాధాన్యతను సంతరించుకుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విట్టల్‌రావు, భాగ్య, నాదనా, దయానంద్ తదితర స్వేరోస్ నాయకులు పాల్గొన్నారు.

తార్నాకలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

❖ *మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి*



దశ, ఓయూ: తార్నాకలోని నాగార్జున నగర్ కమ్యూనిటీ హాల్‌లో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాగార్జున నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ తిరుపతిరావు, కార్యదర్శి జలంధర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు నరేష్, ఉమాకాంత్‌తో పాటు స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శాంతి గార్డెన్‌లో దుర్గామాతకు ఈటల రాజేందర్ ప్రత్యేక పూజలు

ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలి: ఈటల రాజేందర్



దశ, ఓయూ: నాచారం హెచ్ఎంటీ నగర్ డివిజన్ పరిధిలోని శాంతి గార్డెన్‌లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొలువుదీరిన దుర్గామాత అమ్మవారిని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. తమ ఆహ్వానం మేరకు విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఈటల రాజేందర్‌కు, ఆయన రాకకు సహకరించిన పోతగాని గోపాల్ గౌడ్‌కు శాంతి గార్డెన్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, మండప నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగేశ్వర్ రెడ్డి, చంద్రమౌళి, రాజిరెడ్డి, గందమల గోపి, మంజులవాణి, స్థానిక బీజేపీ నాయకులు, శాంతి గార్డెన్ నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాచారం మహాకాళీశ్వర ఆలయంలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆలయ ధర్మకర్తల మండలి.. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

దశ, ఓయూ: నాచారంలోని శ్రీ మహాంకాళీ సహిత మహాకాళీశ్వర స్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం నర్సింహమూర్తి, ఆలయ చైర్మన్ మెతుకు శ్రీనివాస్ రెడ్డి, ధర్మకర్తలు ఈరబోయిన కృష్ణ యాదవ్, నమిలికొండ సునీల్ రెడ్డి, తన్నీరు రాకేష్ కుమార్, కౌరష్ బాలరాజ్,మాజీ చైర్మెన్ రమణ రెడ్డి,సుగుణాకర్, బిజెపి నాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాయు కాలుష్యంలో తాండూరు టాప్!



- ఢిల్లీనీ ధాటి మొదటి స్థానానికి
- అసాధారణ స్థాయిలో ధూళి కణాలు
- కలుషితం అవుతున్న నీటి వనరులు
- ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు
- నాపరాయి.. సిమెంట్ పరిశ్రమలతోనే సమస్య
- పీసీబీ తాజా విచారణలో వెల్లడి
- కాలుష్యకార పరిశ్రమలకు నోటీసులు

దశ, తాండూరు ప్రతినిధి :

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ఏటా రెండు మార్లు వాయు..నీటి..శబ్ద కాలుష్యంను గుర్తించేందుకు విచారణ చేపడుతుంది. ఈ విచారణలో భాగంగా ఆయా ప్రాంతాలలో వాయు కాలుష్యంను నమోదు చేసేందుకు ప్రత్యేకంగా పరికరాలను ఏర్పాటు చేస్తారు. నీటి వనరులలో నీటిని సేకరించి పరీక్షిస్తారు. శబ్ద కాలుష్యంను కొలిచేందుకు ప్రత్యేక పరికరాలను వినియోగిస్తారు. పరిశ్రమలు ఎక్కువగా ఉండే ప్రాంతాలలో ఈ తరహాపరీక్షలను పీసీబీ నిర్వహిస్తుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మాసం వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో ఈతరహా పరీక్షలు నిర్వహించింది. ఈ పరీక్షలలో జిల్లాలోని తాండూరు ప్రాంతంలో వాయు కాలుష్యంలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్నట్లు గుర్తించారు. ఆ తరువాతి స్థానాలలో పటాన్చెరు. కొత్తూరు ఉన్నట్లు తేల్చారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో తరహా పరిశ్రమలతో కాలుష్యం నెలకొన్నట్లు పీసీబీ విచారణలో తేలింది.

గాలిలో పెరిగిన సూక్ష్మ కణాలు

చాలా కాలంగా తాండూరు ప్రాంతం వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. నేటికీ వాయు కాలుష్యం తాండూరును వదలడం లేదు. ఈ ప్రాంతంలో ఉన్న నాపరాయి, సిమెంట్ పరిశ్రమల కారణంగా వాయు కాలుష్యం నెలకొన్నట్లు పీసీబీ విచారణలో తేలింది. నాపరాయి గనులు, పాలిష్‌యూనిట్లు, సిమెంట్ పరిశ్రమలు, సుద్ద పరిశ్రమలు, సరకు రవాణా వాహనాల కారణంగా వాయు కాలుష్యం అసాధారణ స్థాయిలో ఉన్నట్లు గుర్తించారు. గాలిలో వాయు కాలుష్యంకు కారణమయ్యే కొన్ని కణాలు ఉంటాయి.

వీటిలో ప్రమాదకరమైన పీఎం2.5 కణాల సాంద్రత సాధారణం కంటే 5. 6రెట్లు అధికంగా ఉన్నట్లు తేల్చారు. సూక్ష్మ కణాలను పీఎం2.5గా పేర్కొంటారు. గాలిలో ధూళి కణాలను పీఎం10గా పేర్కొంటారు..పాలిష్‌యూనిట్ల కారణంగా గాలిలో సూక్ష్మ ధూళి కణాల సాంద్రత పెరుగుతున్నట్లు పీసీబీ గుర్తించింది. సిమెంట్ పరిశ్రమల సమీప ప్రాంతాలలో గాలిలో సూక్ష్మ కణాలు మరింత అధికంగా ఉన్నట్లు తేల్చారు. రోడ్లపై సరకు రవాణా వాహనాలు ఎక్కువగా పరుగులు తీయడంతో గాలిలో ధూళి కణాలు అధికమవుతున్నట్లు గుర్తించారు.. ఈ పరిశ్రమల కారణంగా వర్షంతో పాటు వ్యర్థాలు నీటి వనరులలో కలిసిపోవడంతో నీటి వనరులు కూడా కలుషితం అవుతున్నట్లు. తేల్చారు.

వెంటాడుతున్న ఆరోగ్య సమస్యలు..

వాయు కాలుష్యంలో తాండూరు ప్రాంతం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండడం కలవరపాటుకు గురిచేస్తోంది. జిల్లా వ్యాపార, వాణిజ్య పట్టణంగా గుర్తింపు పొందిన తాండూరులో వాయు కాలుష్యం అసాధారణ స్థాయిలో ఉండడంతో ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. తాండూరు ప్రాంతంలో వాయ నాణ్యత సూచిక (ఏక్యూఐ) నిర్దేశించిన స్థాయిలో లేకపోవడం, గాలిలో పీఎం2.5 (సూక్ష్మ కణాలు) చాలా అధికంగా ఉండడంతో ప్రజలు గొంతు, దగ్గుతో పాటు చర్మ, శ్వాస సంబంధ వ్యాధులు, కంటి సమస్యలను. ఎదుర్కోవాల్సి ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. తాండూరును. చాలా కాలంగా వాయు కాలుష్యం ముంచెత్తడంతో ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. తాండూరు ప్రాంతంలో వాయు కాలుష్యంకు కారణం అవుతున్నట్లు పరిశ్రమలు నోటీసులు జారీ చేసేందుకు కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) సిద్ధమవుతోంది.. ఇప్పటికే కొన్ని పరిశ్రమలకు నోటీసులు కూడా జారీ చేశారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



వాయు కాలుష్యాన్ని విడుదల చేసే సిమెంట్ ఇండస్ట్రీలను మరియు నాపరాతి ఇండస్ట్రీ లను మూసివేయాలి లేదా ఇతర చోటికి తరలించాలి లేదా వాళ్ళ పైన కాలుష్యం విడుదల కాకుండా చర్యలు తీసుకోవాలి. ప్రజల ఆరోగ్యంతో చెలగటం ఆడే ఏ ఒక్క వాటిని మేము సహించము. ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. కాబట్టి సాధ్యమైనంతవరకు ఇండస్ట్రీలను తరలించే ప్రయత్నం చేయాలి. పంటలు కూడా తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ప్రజలకు ఆరోగ్య సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. కలుషిత ఆహార పదార్థాలు కూడా తినవలసి వస్తుంది . దుమ్ము దులి ఇతర శక్తి జీవులు నోట్లోకి పోయి ప్రజలు ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నారు. వీటన్నింటి పైన ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

- సీ.కృష్ణవేణి,ఏరూర్ వార్డ్, తాండూర్

విశ్వవిద్యాలయాల్లో మరో 1,000 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు పెంచాలి

❖ *ముఖ్యమంత్రి పునఃసమీక్ష చేయాలి.. విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్. అశోక్ విజ్ఞప్తి*

దశ ఓయూ: తెలంగాణలోని విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల సంఖ్యను పెంచాలని విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్. అశోక్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ల కొరత కారణంగా మేధోపరమైన ఆలోచనలు, పరిశోధనలు ఆశించిన స్థాయిలో జరగడం లేదని పేర్కొన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి ప్రభుత్వం 429 పోస్టులకు మాత్రమే అనుమతి ఇవ్వడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని మరోసారి పునఃసమీక్షించి, అదనంగా 1,000 పోస్టులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మొత్తం పోస్టుల సంఖ్య 1,500కు మించకుండా కాకుండా, అవసరాలకు అనుగుణంగా పెంచి విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల కొరతను తీర్చాలని కోరారు. మేధావుల ఆలోచనలు, పరిశోధనలతోనే తెలంగాణ సమాజంలో చైతన్యం పెరిగి, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం అన్ని రంగాల్లో ముందుకు సాగుతాయని డాక్టర్ అశోక్ పేర్కొన్నారు. ఇప్పటికే పలు రంగాల్లో వెనుకబడి ఉన్న రాష్ట్రం పురోగతి సాధించాలంటే ఉన్నత విద్యాసంస్థలను బలోపేతం చేయాలని, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల పెంపుపై ప్రభుత్వం మరోసారి పునఃసమీక్ష చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



నాచారం శాంతి గార్డెన్‌లో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

❖ *తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో వేడుకలు.. భారీగా పాల్గొన్న మహిళలు, చిన్నారులు*

దశ, ఓయూ: నాచారంలోని శాంతి గార్డెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు అసోసియేషన్ సభ్యులు, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం అన్నదాతలు రమేష్, రాజశేఖర్, విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు లక్ష్మణ్, శ్రీధర్, ఉమేష్, అజయ్, అరవింద్, శ్రీకాంత్, నాయర్, రమేష్, విజయ్, గౌతంరెడ్డితో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొమ్మిది రోజులపాటు భక్తి భావంతో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించారు.

ప్రా జయశంకర్ స్టేడియంలో అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ సంబరాలు. ఆకట్టుకున్న సింగర్ తేజు ప్రియ బతుకమ్మ పాటలు





దశ, ఓయూ: రామ రామ రామ ఉయ్యాలో... బతుకమ్మ ..బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ తెలంగాణ సింగర్ తేజు ప్రియ పాటలకు మహిళలంతా ఆనందోత్సవాల మధ్య స్టెప్పులేసారు. ఆదివారం రాత్రి లాలాపేటలోని ప్రొ జయశంకర్ స్టేడియంలో సుక్క గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ, దాండియా వేడుకలకు భారీగా ఏర్పాట్లు చేశారు. తొమ్మిది రోజుల పాటు తీరొక్క పూలతో వివిధ రూపంలో చేసుకున్న బతుకమ్మ వేడుకలు సద్దుల బతుకమ్మ ఆడబిడ్డల పూల సంబురాలు ముగుస్తాయి.

ఈ వేడుకలకు భారీ సంఖ్యలో హాజరైన మహిళలు రక రకాలైన పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టు బతుకమ్మ పాటలకు ఆడుతూ సందడి చేశారు. ఈ వేడుకలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, స్టేట్ జనరల్ సెక్రటరీ గౌతమ్‌రావు, శారదా మల్లేష్, ప్రమోద్, స్థానిక బిజేపి నాయకులు పాల్గొని బతుకమ్మ వేడుకలను తిలకించారు.





సాయిపూర్‌లో సద్దుల బతుకమ్మ వేడుకలు





దశ,తాండూర్ ప్రతినిధి: సాయిపూర్ లో సత్తుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ వేడుకల్లో పైలెట్ రోహిత్ రెడ్డి దంపతులు వికారాబాద్ మాజీ జెడ్పీటీసీ ప్రమోదిని పాల్గొన్నారు. తాండూరు పట్టణంలోని సాయిపూర్‌లో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పట్లోళ్ల దీపా నర్సింలు ఆధ్వర్యంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తన సతీమణి ఆర్తి రెడ్డి మరియు మాతృమూర్తి వికారాబాద్ మాజీ జెడ్పీటీసీ ప్రమోదిని విఠల్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాలుపంచుకున్నారు.పట్లోళ్ల దీపా నర్సింలు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా సాయిపూర్‌లో పండుగ వాతావరణం నెలకొంది.

ఖేలో ఇండియా వాలీబాల్ ఎంపిక పోటీలు



దశ, బెల్లంపల్లి: బెల్లంపల్లి మండలం లోని తాళ్ల గురజాల గ్రామంలో ఖేలో ఇండియా ఉమ్మడి అదిలాబాద్ జిల్లా అండర్ 17 బాలురు, బాలికలకు వాలీబాల్ ఎంపిక పోటీలు సోమవారం జరిగాయి. బెల్లంపల్లి పోలీసు డిపార్టుమెంటు సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ వాలీబాల్ క్రీడాకారులు ఏసిసి రవి, తాళ్ల గుర్జాల ఎస్ఐ ప్రశాంత్, గురజాల సర్పంచ్ వంగ రాములు, చంద్రవెల్లి సర్పంచ్ శ్రీనివాస్, గురజాల ఉప సర్పంచ్ డాకూరి సురేష్, గురజాల వార్డు సభ్యులు వెంకటేష్, కోటయ్య, సీనియర్ క్రీడాకారులు ముస్తఫా రమేష్, రషీద్, నరేష్, సందీప్, కేశవ్, రాహుల్, సాయికుమార్, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ని ఉద్దేశించి తాళ్ల గురిజాల సర్పంచ్ వంగ రాములు మాట్లాడుతూ వాలీబాల్ క్రీడలో నైపుణ్యం, ప్రతిభ ఉన్న క్రీడాకారులను ఈ వాలీబాల్ పోటీలలో ఎంపిక చేయడం జరుగుతుందని,ఎంపిక పారదర్శకంగా జరుగుతోందని, ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయిలో పాల్గొంటారని అన్నారు.ఈ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు.

నిత్య పూజలతో దర్శనమిస్తున్న దుర్గామాత



దశ, చిన్నంబావి: మండల పరిధిలోని పెద్దమారు గ్రామంలో అమ్మవారి విగ్రహాలకు ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలకు దంపతులు అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహిస్తూ భక్తిశద్ధలతో పూజిస్తున్నారు. ప్రతిరోజూ సాయంత్రం అమ్మవారి సన్నిధిలో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కులమతాలకు అతీతంగా గ్రామస్తులు, మండల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మంగళహారతులు సమర్పిస్తున్నారు. అనంతరం అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు. సాయంత్రం వేళల్లో భజనలు, కీర్తనలు, ఆటపాటలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటోంది. చిన్నా పెద్దా తేడా లేకుండా మహిళలు, భక్తులు భజనల్లో పాల్గొని అమ్మవారిని ఆరాధిస్తున్నారు. గ్రామంతో పాటు మండల ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నారు. ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమని గ్రామస్తులు పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ పూజా కార్యక్రమాల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.



ఆసరా కొత్త పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలి

దశ, జనగామ: నాలుగేళ్లుగా ఆసరా పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన లబ్ధిదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పెన్షన్లు మంజూరు చేసి పంపిణీ చేయాలని సీపీఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ డిమాండ్ చేశారు. సోమవారం జనగామలోని సీపీఎం కార్యాలయంలో కళ్యాణం లింగం అధ్యక్షతన నిర్వహించిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు నెల రోజులపాటు కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తులు స్వీకరించి, దసరా నుంచి అర్హులకు ఆసరా పెన్షన్లు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని గుర్తుచేశారు. అయితే, ప్రస్తుతం పెన్షన్ల మంజూరుపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదని విమర్శించారు.

2022లో చివరిసారిగా పెన్షన్లు మంజూరు చేశారని, అప్పటి నుంచి కొత్త పెన్షన్ల కోసం అర్హులైన వారు ఎదురుచూస్తున్నారని తెలిపారు. 57 ఏళ్లు నిండినప్పటికీ పెన్షన్ అందక అనేకమంది వృద్ధులు నిరాశకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్య పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా లేకపోవడంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అర్హులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, ఫైలేరియా బాధితులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు తదితర అర్హులైన లబ్ధిదారులు పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే దరఖాస్తు చేసుకున్న వారికి పెన్షన్లు మంజూరు చేయడంతోపాటు, అర్హులైన వృద్ధులకు కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

నాచారం మహాంకాళి ఆలయంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



❖ *భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు.. లలితా సహస్రనామ పారాయణం, నవదుర్గా హారతులు*

దశ, ఓయూ: నాచారంలోని శ్రీ మహాంకాళి సహిత మహాకాళీశ్వర స్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం తొమ్మిదో రోజు అమ్మవారికి మహిళా భక్తురాలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువు లక్ష్మి సహకారంతో 'ఓం శ్రీ దుర్గాయై నమః' మంత్రాన్ని స్మరిస్తూ అమ్మవారిని ఆరాధించారు. ఈ సందర్భంగా లలితా సహస్రనామ పారాయణం, దుర్గా నామస్మరణ, చండీ అష్టోత్తర పూజ, నవదుర్గా హారతులు నిర్వహించారు. ఆలయంలో భక్తి వాతావరణం నెలకొనగా, భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.అమ్మవారికృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు.

మేరీల్యాండ్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



❖ *గ్రేటర్ ఫ్రెడరిక్ బతుకమ్మ వేడుకలకు 2,000 మంది హాజరు*


❖ *తెలంగాణ సంస్కృతికి అమెరికా ప్రతినిధుల గుర్తింపు పత్రం*

దశ, అమెరికా: అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రేటర్ ఫ్రెడరిక్ బతుకమ్మ మేరీల్యాండ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు దాదాపు 2,000 మంది హాజరై పండుగ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు సంప్రదాయ దుస్తుల్లో చేరి ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతను, పూల పండుగ ప్రత్యేకతను చాటిచెప్పేలా వేడుకలు సాగాయి.

ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు రేలారే రవి తన పాటలతో ప్రేక్షకులను అలరించారు. ఆయన ఆలపించిన పాటలకు హాజరైనవారు ఉత్సాహంగా స్పందించడంతో వేడుకల ప్రాంగణం సందడిగా మారింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బతుకమ్మల పోటీల్లో అందంగా తీర్చిదిద్దిన బతుకమ్మలకు బహుమతులు అందజేశారు. తెలంగాణ సంప్రదాయాల పరిరక్షణతో పాటు విదేశాల్లో పెరుగుతున్న తరాలకు మన సంస్కృతిని పరిచయం చేయడంలో ఈ వేడుకలు కీలక పాత్ర పోషించాయి. ఈ వేడుకలకు విశేష గుర్తింపుగా కాంగ్రెస్ ప్రతినిధి ఏప్రిల్ మెక్క్లోయిన్ డెలానీతో పాటు కౌంటీ ప్రతినిధులు హాజరై బతుకమ్మ పండుగ విశిష్టతను తెలుసుకున్నారు.

తెలంగాణ మహిళలు ప్రకృతిని పూల రూపంలో ఆరాధిస్తూ జరుపుకునే ఈ పండుగ గొప్పతనాన్ని అభినందించారు. బతుకమ్మ పండుగను అధికారికంగా గుర్తిస్తూ గుర్తింపు పత్రాన్ని (సైటేషన్) అందజేశారు.

అమెరికా గడ్డపై తెలంగాణ సంస్కృతికి లభించిన ఈ గుర్తింపు వేడుకల్లో పాల్గొన్న వారిలో ఆనందాన్ని నింపింది.జీత్ గుండవార్, ఫణి జలువంచ, పండు పచిమట్ల, సునీల్, ఉత్కల్ కందాల, గోపీ లగ్గిశెట్టి, సంజయ్, సునీల్ ఊటూరి, మహేశ్ ఐత, రోజా రెడ్డి, జ్యోత్స్న, త్రివేణి, శ్వేత, ఎస్.ప్రసన్న తదితరుల ఆధ్వర్యంలో వేడుకలు విజయవంతంగా నిర్వహించారు. ప్రవాస గడ్డపై తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ఘనంగా చాటిచెప్పిన ఈ బతుకమ్మ సంబరాలు అక్కడి తెలుగు ప్రజల్లో ఐక్యతను, సాంస్కృతిక అనుబంధాన్ని మరింత బలోపేతం చేశాయి.



లండన్‌లో చేనేత బతుకమ్మ–దసరా వేడుకలు

దశ, లండన్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిమళాన్ని విదేశీ గడ్డపై చాటుతూ తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్‌డమ్ (టాక్) ఆధ్వర్యంలో నిర్వహించిన 'చేనేత బతుకమ్మ-దసరా' వేడుకలు వైభవంగా జరిగాయి. యూకేలోని వివిధ ప్రాంతాల నుంచి రెండు వేల మందికి పైగా ప్రవాస తెలంగాణ కుటుంబాలు ఈ వేడుకల్లో పాల్గొన్నాయి. తెలంగాణ పండుగల విశిష్టతను చాటడంతో పాటు చేనేత వస్త్రాలకు ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ వేడుకలకు బ్రిటన్ పార్లమెంట్ సభ్యురాలు రూత్ క్యాడ్‌బరీ, మాజీ ఎంపీ వీరేంద్ర శర్మ, హౌన్స్లో మేయర్ రణ్జిత్ గిల్, కౌన్సిల్ నాయకుడు శాంతను రాజావత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.టీజీవీఫ్ఢీసీ మాజీ చైర్మన్, టాక్ వ్యవస్థాపకుడు అనిల్ కూర్మాచలం ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల మాట్లాడుతూ.. చేనేత కార్మికులకు అండగా నిలవడంతో పాటు వారి వృత్తికి ప్రోత్సాహం అందించాలనే సామాజిక బాధ్యతతో ఏటా 'చేనేత బతుకమ్మ-దసరా' వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనిల్ కూర్మాచలం మాట్లాడుతూ.. విదేశాల్లో ఉంటూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా చాటుతున్న టాక్ కార్యవర్గం కృషి అభినందనీయమన్నారు. వేడుకల్లో పాల్గొన్న ప్రవాస తెలంగాణ కుటుంబ సభ్యులు, అతిథులతో పాటు కార్యక్రమ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.వేడుకల్లో మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. గౌరీదేవికి పూజలు నిర్వహించిన అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలతో సందడి చేశారు.

దసరా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి



దశ, మునగాల: దసరా పండుగను మండల ప్రజలు సంతోషంగా, ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై మల్లు సంజీవరెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ నందు తెలంగాణం ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ, దసరాపండుగ, మరియు దేవీనవరాత్రుల శోభాయాత్ర ఊరేగింపు సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. దసరా పండుగలు పురస్కరించుకొని గ్రామీణ ప్రాంతాలలో వేడుకల్లో మరియు దేవీ నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా నిర్వహించే శోభాయాత్ర వేడుకల్లో వేళ ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని, ఇతరుల మనోభావాలను దెబ్బతీయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్సై సూచించారు. బెట్టింగ్‌లు, జూదం, గొడవలు, తగాదాలకు దూరంగా ఉండాలని, పండుగలను సంప్రదాయబద్ధంగా, సోదరభావంతో జరుపుకోవాలని కోరారు.

బెల్లంపల్లిలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



దశ, బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణంలోని 13, 14వ వార్డుల్లో సద్దుల బతుకమ్మ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. పండుగను పురస్కరించుకుని మహిళలకు చీరలు, బహుమతులు, బ్యూటీ కిట్లను పంపిణీ చేశారు.14వ వార్డులో నిర్వహించిన వేడుకల్లో టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి పాల్గొన్నారు. బతుకమ్మలను అందంగా అలంకరించిన మహిళలకు మొదటి, రెండో, మూడో బహుమతులుగా చీరలను అందజేశారు. మహిళలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఝటాయు కాస్మోటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన బండి లక్ష్మణ్ బ్యూటీ కిట్లను పంపిణీ చేశారు. బహుమతులు అందుకోవడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.